మమతకుఁ బ్రబలోదాహరణముగ నున్నది. అయినను మన యాంధ్రసోదరీమణులు సద్గ్రంథములు రచించి మాతృసేవలో ముందంజ వేయవలసియున్నది. గ్రంథాలయముల సాముదాయకసభలు జరుగుచుండవలెను. ప్రజలు గ్రంథాలయముల గౌరవించి పూజింపవలెను. పంచాననవంటి సంఘపత్రికలును, ఆయుర్వేదపత్రికను బోలు విజ్ఞాన ప్రదర్శనపత్రికలును బయలువెడలవలసి యున్నవి. ఎల్ల పాఠశాలలోనివిద్యార్థులు మాతృభాష నూరక నేర్చిన వాఁగాక యాంధ్రికి సత్సంతానము గావలసియున్నది. ఈ గొంతెమకోరిక లన్నియును నేజగద్బంధుఁడో, ధర్మమూర్తియో, యే దివ్యరూపుఁడో ఫలోన్ముఖమునకుఁ దెచ్చునుగాక! ఈశ్వరుఁ డాశీర్వదించుఁ గాక!

---

# ఏకాంత సుఖము

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు బి. ఏ.,

ఈయడవి దాగిపోనా?
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా?

ఆకులో ఆకునై
పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై
నునులేత రెమ్మనై
ఈయడవిదాగిపోనా
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా ?

గలగలని వీచు చిఱు
గాలిలో కెరటమై,
బలబలని పాడు
సెలపాటలో తేటనై
ఈయడవిదాగిపోనా
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా ?

తరులెక్కి—యలసీల
గిరులెక్కి—మెలమెల్ల
చదలెక్కి—జలదంపు
నీలంపునిగ్గునై
ఈయడవిదాగిపోనా
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా ?

ఆకలా దాహమా
చింతలా వంతలా
ఈకరణి వెఱ్ఱినై
ఏకతమ తిరుగాడ ?
ఈయడవిదాగిపోనా
ఎట్లైన
ఇచటనే ఆగిపోనా ?